


సిరి ఎఫెక్ట్..సిరి ఎఫెక్ట్

## సిరి ఎఫెక్ట్

సిరి ఎఫెక్ట్..సిరి ఎఫెక్ట్

# కాసాల ఉద్యమం!



## సిరి కథనాలతో మొదలైన పోరుబాట

- కబ్జాకు గురవుతున్న భూమి కాపాడాలని విజ్ఞప్తులు
- మరోమారు భూ పోరాటానికి సిద్ధమంటున్న సీపీఎం
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన సీపీఎం నాయకులు
- పేదల భూముల జోలికి రావద్దు..
- రెవెన్యూ అధికారులకు భూ కబ్జాలు కనిపించడం లేదా
- ప్రభుత్వ భూములను కాపాడాలి
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం
- సీపీఎం నాయకుల హెచ్చరిక

**హత్నూర, ఫిబ్రవరి 11(సిరిన్యూస్):** గుట్టు చప్పుడు కాకుండా కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి గుట్టును సిరి దినపత్రిక రట్టు చేసింది. ప్రభుత్వ భూమి కబ్జా అంటూ సిరి దినపత్రికలో ప్రచురితమైన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వార్తా కథనంతో నాడు భూ పోరాటం చేసిన సిపిఎం పార్టీ రంగంలోకి దిగింది. తిరిగి ఆ భూమిని పేదలకు పంచడమే తమ ఎజెండాగా సాగుతుంది. అందుకు ప్రణాళికా బద్ధంగా కార్యాచరణ చేస్తూ ముందుకు కదులుతుంది. అందులో భాగంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు బృందం మంగళవారం తహసీల్దార్ ఫర్హీన్ షేక్ కు వినతి పత్రం అందజేశారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17 యేళ్ళ క్రితం గ్రామానికి చెందిన నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకొని పోరాటం చేశారని గుర్తు చేశారు. సిపిఎం పార్టీ ఆ పేదలకు అండగా నిలబడి పోరు బాట నడిపిందని వారన్నారు. వందలాది మంది నిరుపేదలు ఇళ్ల జాగల కోసం అలుపెరుగని పోరాటం చేశారని వారన్నారు.వానకు తడుస్తూ,చలికి వణుకుతూ,భగ్గుమన్న ఎండలను సైతం లెక్కచేయకుండా ఇళ్ల స్థలాల కోసం ఏడాది పాటు అలుపెరుగని పోరాటం చేశారని వారు చెప్పారు. ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న నిరుపేదలపై లాఠీలు ఝులిపించి తన్ని తరిమేసిన రెవెన్యూ అధికారులకు భూ కబ్జాలు కనిపించడం లేదా అని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కబ్జాకు గురవుతున్న ఆ భూమిని స్వాధీనం చేసుకుని సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రస్థాయిలో ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంద్రసేనా, శేఖర్ తదితరులు ఉన్నారు.




